క్లుప్తంగా

డీఎఫ్‌వోతో జీఎం భేటీ



సర్వేశ్వరరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ మంచిర్యాల ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్(డీఎఫ్‌ఓ) సర్వేశ్వరరావుతో భేటీ అయ్యారు. శుక్రవారం జీఎం కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో ఇరువురు కలిసి ఓసీపీకి సంబంధించిన ఫారెస్టు క్లియరెన్సులపై చర్చించారు. ఎస్సార్పీ ఓసీపీ విస్తరణలో భాగంగా అటవీశాఖ చెందిన 164 హెక్టార్ల ఫారెస్టు భూమికి క్లియరెన్సు రావడంతో నేడు ఉత్పత్తి మరింత పెంచుకునే అవకాశం ఏర్పడిందని జీఎం తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎన్.సత్యనారాయణ, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి టి.శ్రీనివాస్, ఎస్టేట్ అధికారి వరలక్ష్మి, ఫారెస్ట్ అధికారి చంద్రమణి, ఎఫ్ఆర్వో రత్నాకర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బెల్లంపల్లి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బెల్లంపల్లి వన్‌టౌన్ ఏఎస్సై నర్సయ్య సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలపై శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కావొద్దన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏ.అంజయ్య, లెక్చరర్లు కృష్ణవేణి, కరుణాకర్, గురుపాదం, లక్ష్మణ్, చంద్రయ్య, విమల్‌కుమార్, సత్తయ్య, రాజేష్, తిరుమల, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సమ్మయ్య, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మెరుగైన సేవల కోసమే క్యూఆర్ కోడ్

బెల్లంపల్లి: పౌరులకు మెరుగైన సేవలందించేందుకు తెలంగాణ పోలీసుశాఖ ప్రత్యేక ప్రచారకార్యక్రమంలో భాగంగా క్యూఆర్ కోడ్ ప్రవేశపెట్టిందని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్ తెలిపారు. క్యూఆర్ కోడ్‌పై సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సిబ్బందికి అవగాహన కల్పించారు. స్టేషన్లలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయాలు కోరుతున్నట్లు సీఐ తెలిపారు.

సన్మానం

జన్నారం: జన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియామకమైన సయ్యద్ ఫసీఉల్లాను శుక్రవారం స్థానిక మహమ్మదీయ మసీదులో మైనార్టీల ఆధ్వర్యంలో సన్మానించారు. మైనార్టీలను గుర్తించి వైస్ చైర్మన్ పదవి అప్పగించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్‌కు ధన్యవాదాలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ మోయిద్దీన్, ఉపాధ్యక్షుడు సాబీర్ పాషా, మాజీ ఎంపీటీసీ ఎండీ రియాజుద్దీన్, పీఏసీఎస్ డైరెక్టర్ సాదుపాషా, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఎంఏ రజాక్, పొనకల్ మాజీ ఉప సర్పంచ్ మోసిన్ షాఖాన్, రియాసత్ అలీ, సుల్తాన్, ఫసియొద్దీన్, ఎంఏ రషీద్ పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ

జన్నారం: మండల కేంద్రంలోని పోన్కల్ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి మాజీ జెడ్పీటీసీ రాఘవేంద్ర ట్రస్టు చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ రూ.30 వేల విరాళం అందజేసి ఉదారత చాటుకున్నారు. త్వరలో జరిగే శ్రీ గోదాదేవి రంగనాథుల కల్యాణ మహోత్సవ కార్యక్రమ నిర్వహణ కోసం విరాళం అందించినట్లు ఆయన తెలిపారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాసగౌడ్, ఆలయకమిటీ సభ్యులు అంజి, రవి, సతీశ్‌గౌడ్, నరేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

నెన్నెల: మండలంలోని మన్నెగూడంలో బొమ్మన శ్రీనివాస్‌గౌడ్ 20వ వర్ధంతి సందర్భంగా యువకులు శుక్రవారం నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీనివాస్‌గౌడ్ సతీమణి, మాజీ ఎంపీపీ శ్రీమతిదేవి, కుమారుడు గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీశ్‌గౌడ్ హాజరై దుప్పట్లు పంపిణీ చేశారు. దుప్పట్ల పంపిణీ చేపట్టిన గోగర్ల రాజశేఖర్‌ను అభినందించారు. కాంగ్రెస్ నాయకులు గోమాస లింగయ్య, దుర్గం గంగయ్య, దరావత్ గణేశ్, సిడాం శంకర్, గోలేటి సంధ్య పాల్గొన్నారు.

'ముక్కోటి' పూజలు



మంచిర్యాలలో బారులుతీరిన భక్తులు



చెన్నూర్ జగన్నాథాలయంలో..



పాతమంచిర్యాలలోని రామలింగేశ్వర ఆలయంలో..



తాండూర్: పూజలు చేస్తున్న భక్తులు

ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఉదయం నుంచే ఉత్తరద్వారాల గుండా స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. అనంతరం అర్చనలు, అభిషేకాలు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఉత్తరద్వారం గుండా స్వామివారిని దర్శనం చేసుకున్నారు. హాజీపూర్ మండలం గుడిపేట గోవింద క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ఉత్తరంలో ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. బెటాలియన్ కమాండెంట్ పి.వెంకటరాములు దంపతులతోపాటు అధికారులు, కుటుంబాలు, పలువురు పూజలో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



విశ్వనాథ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



గుడిపేట గోవింద క్షేత్రంలో..



జన్నాపూర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో..



భీమారంలోని రామాలయంలో..



తిరుమలగిరి కాలనీలో..

'ఆవడం' మండలం ఏర్పాటు చేయాలి

నెన్నెల: మండలంలోని ఆవడం పంచాయతీని నూతన మండలాన్ని ఏర్పాటు చేయాలని కొత్తూర్ గ్రామస్తులు, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మహ్మద్ జలీల్ ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఆవడం మండలంగా ఏర్పడితే 9 గ్రామాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు సంతకాల సేకరణ చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. నాయకులు బోయిని పోశం, కట్నె రమేశ్, రవణయ్య, రవికుమార్, రాజలింగు పాల్గొన్నారు.

స్వామి వివేకానందకు నివాళి

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి కేరళలో ఫిబ్రవరి 15 నుంచి 21 వరకు జరిగే నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థి అజయ్ ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ చక్రపాణి, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి ఈ సందర్భంగా అజయ్‌ను అభినందించారు.

చెన్నూర్‌రూరల్: కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా స్వామి వివేకానంద చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ప్రిన్సిపాల్ ఎంవి.పట్వర్దన్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మంచిర్యాలఅర్బన్: స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ప్రిన్సిపాల్

గిరి గ్రామాల అభివృద్ధే ధ్యేయం

తాండూర్: గిరి గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పోలీసులు పని చేస్తున్నారని డీసీపీ భాస్కర్ అన్నారు. మండలంలోని నర్సాపూర్‌లో శుక్రవారం పోలీసులు మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. మాదారం పోలీసులు, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజనులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ గిరిజనులు చైతన్యవంతులైతేనే గిరి గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయన్నారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, మాదారం, తాండూర్ ఎస్సైలు సౌజన్య, కిరణ్‌కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు శరత్‌కుమార్, సంతోష్, లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



దుప్పట్లు అందజేస్తున్న డీసీపీ భాస్కర్

విద్యాసంస్థల్లో సంక్రాంతి

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని విద్యాసంస్థల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. చిన్నారుల హరిదాసు వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయురాలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంప్రదాయాలు ఉట్టిపడేలా రంగులతో వేసిన ముగ్గులు అలరించాయి. పలుచోట్ల విద్యార్థులు పతంగులు ఎగురవేశారు. హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు ఉన్నారు.



మంచిర్యాల కేవీలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

చెరువు అన్యాక్రాంతంపై విచారణ

మంచిర్యాలటౌన్: రామునిచెరువు అన్యాక్రాంతంపై రెవెన్యూ, ఇరిగేషన్ మున్సిపల్ శాఖ అధికారులు శుక్రవారం విచారణ జరిపారు. చెరువు అన్యాక్రాంతంపై గతంలో స్వచ్ఛంద పౌరసేవాసంస్థ ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆయా శాఖ అధికారులు చెరువును సందర్శించారు. చెరువులో వేసిన అక్రమరోడ్డు, నిర్మాణాలు, చెత్తతో చెరువును పూడుస్తున్న విధానంపై సంస్థ సభ్యులు అధికారులకు చూపించారు. చెరువులో మట్టి పోయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే పోసిన మట్టిని ఎత్తివేయాలని, చెరువు చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్‌ను పునరుద్ధరించాలని అధ్యక్ష, కార్యదర్శులు మల్లయ్య, మధుసూదన్‌రావు కోరారు. తహసీల్దార్ రఫత్ అలీ, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి శ్యాం, సంస్థ సభ్యులు రంగు రాజేశం, కైలాసం, ప్రదీప్ పాల్గొన్నారు.

చెరవీడిన ఆశ్రమ పాఠశాల స్థలం

వేమనపల్లి: ఏళ్లుగా ఆక్రమణలో ఉన్న గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల రెండు ఎకరాల స్థలం ఎట్టకేలకు కబ్జా చెర వీడింది. హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయుడు జ్ఞానేశ్వర్, మాజీ సర్పంచ్ రమేశ్, తాళ్ల వెంకాగౌడ్‌లతో కలిసి శుక్రవారం ఆ భూమిని స్వాధీనం చేసుకుని హద్దురాళ్లు పాతారు. పదేళ్లుగా పక్కనే ఉన్న పట్టాదారు అయిన మాజీ సర్పంచ్.. భూమిని కబ్జా చేసి సాగు చేసుకుంటున్నాడు. పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేయగా కబ్జాకు గురైన పశ్చిమం వైపు ప్రహరీ నిర్మించకుండా మాజీ సర్పంచ్ అడ్డుకుంటున్నాడు. గతేడాది జులై 15న దస్నాపూర్ మాజీ సర్పంచ్ రమేశ్, తాళ్ల వెంకటేశ్‌గౌడ్ కబ్జాకు గురైన స్థలాన్ని పాఠశాలకు అప్పగించాలని కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎస్ఎల్ఆర్ ఏడీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంసీ దశరథ్‌లు పలుమార్లు కొలతలు చేసి హద్దులు నిర్ణయించారు. పాఠశాలకు ఐదెకరాలతోపాటు రెండు ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించారు. నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో హెచ్‌ఎం శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ రమేశ్‌కు సమాచారం ఇచ్చి ఉపాధ్యాయ సిబ్బంది, దస్నాపూర్, కొత్తపల్లి యువకులు హద్దురాళ్లు ఏర్పాటు చేశారు.

'మాజీఎమ్మెల్యేపై విమర్శలు సరికాదు'

బెల్లంపల్లి: మాజీఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై కాంగ్రెస్ నాయకులు తప్పుడు విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని కన్నాలబస్తీ, టేకులబస్తీల్లో సింగరేణి క్వార్టర్లకు ఉన్న విద్యుత్ కనెక్షన్లు తొలగించడంపై ఆందోళన చేస్తున్న ప్రజలు, మహిళలకు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అక్కడికి వెళ్లి సంఘీభావం తెలిపారే తప్ప ఎమ్మెల్యే గడ్డం వినోద్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

తాండూర్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని విద్యాభారతి పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 9న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన డి.హరీశ్, ఐ.విష్ణువర్ధన్లు ఉత్తమ ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

పాఠశాలలో పతంగుల పోటీలు

భీమారం: సంక్రాంతి పురస్కరించుకొని బూర్గుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం పతంగుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించినట్లు హెచ్‌ఎం విజయ్‌కుమార్ తెలిపారు.

రక్తదానం

జన్నారం: కవ్వాల్‌కు చెందిన మాలమహానాడు యూత్ అధ్యక్షుడు అంబటి శరత్ రక్తదానం చేసి నిండు ప్రాణాన్ని కాపాడాడు. గ్రామానికి చెందిన వెంకటేశ్ అనారోగ్యంతో నిర్మల్‌లో చికిత్స పొందుతున్నాడు. అతనికి ఓ పాజిటివ్ బ్లడ్ అవసరం కావడంతో శరత్ శుక్రవారం రక్తదానం చేశారు.

సింగరేణి క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్: సింగరేణి నూతన సంవత్సర క్యాలెండర్‌ను శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తన కార్యాలయంలో అధికారులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఏరియా ఎస్ఓటు జీఎం ఎన్.సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి టి.శ్రీనివాస్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవిలు, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, ఐఈడీ ఎస్ఈ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

జైపూర్: ఎస్టీపీపీలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్‌రావు, అధికారులు, ఉద్యోగులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ పిట్ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న జీఎం సూర్యనారాయణ

కాసిపేట: కాసిపేట గనిపై శుక్రవారం ఏఐటీయూసీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను నాయకులు ఆవిష్కరించారు. బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, గని ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ రాజేందర్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు రంజిత్‌కుమార్, రాజన్న, అశోక్, నాయకులు లింగన్న, నాగేశ్వరరావు, శ్రీనివాస్, రఘురాం, హరీశ్ ఉన్నారు.

నేడు ధర్నా

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించనున్నట్లు సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, బ్రాంచి అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ తెలిపారు. సివిల్ డిపార్టుమెంట్ వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. జీవో నంబర్ 22 ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారికి వైద్య సదుపాయం కల్పించాలని, పండుగ సెలవులు మంజూరు చేయాలని తదితర డిమాండ్లపై జరిగే ధర్నాలో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. చంద్రమోహన్, ప్రభాకర్, వీరేశం, చారి, సమ్మయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

టీపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

మంచిర్యాలఅర్బన్: డీఈవో కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ ప్రోగెసివ్ టీచర్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో ముద్రించిన 2025 డైరీని డీఈవో యాదయ్య ఆవిష్కరించారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఆశ్రమ పాఠశాలలో కొత్త మెనూ అమలు చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదించాలని డీఈవోను కోరారు. రాష్ట్ర కార్యదర్శి భుజంగరావు, జిల్లా అధ్యక్షుడు సంజీవ్, ప్రధాన కార్యదర్శి మనోజ్‌భుక్యా, జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లిలో..

దండేపల్లి: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2025 క్యాలెండర్, డైరీని దండేపల్లిలో తహసీల్దార్ సంధ్యారాణి శుక్రవారం ఆవిష్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల శంకర్‌గౌడ్, నాయకులు సుగుణాకర్, కాంతయ్య, లక్ష్మణ్, శేఖర్, గంగన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

చెన్నూర్: ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీం తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో లక్షలాది మంది మాదిగ సోదరులతో లక్ష డప్పు సభ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వర్గీకరణ అమలు చేస్తే లక్ష డప్పులతో స్వాగతం పలుకుతామన్నారు. లేదంటే చావు డప్పు మోగిస్తామని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ బాపు, మాజీ జెడ్పీటీసీ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వేమనపల్లి: మండలానికి రూ.5,92,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరైనట్లు మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ తెలిపారు. శుక్రవారం నీల్వాయిలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

ఐదుగురు బైండోవర్

భీమిని: నిషేధిత పత్తి విత్తనాలను గతంలో విక్రయించిన నిందితులను తహసీల్దార్ బికర్నాదాస్ ఎదుట శుక్రవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మండలానికి చెందిన షేక్ అంజాద్ పాషా, వెంకటేశ్, జాహీద్ పాషా, సుధాకర్, శంకర్‌ను బైండోవర్ చేసి వదిలిపెట్టారు.

పత్తి కొనుగోళ్లు బంద్

తాండూర్: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని రెండు జిన్నింగ్ మిల్లుల్లో పేరుకుపోయిన పత్తి నిల్వలు సంక్రాంతి సెలవుల కారణంగా ఈనెల 11నుంచి 15 వరకు సీసీఐ ద్వారా కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు కార్యదర్శి భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. 16 తేది నుంచి యథావిధిగా కొనుగోళ్లు ఉంటాయని పేర్కొన్నారు.

ఘనంగా ఇంటర్ కార్మల్ స్పోర్ట్స్ మీట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేట మౌంట్ కార్మల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 11వ ఇంటర్ కార్మల్ స్పోర్ట్స్ మీట్–2025 ఘనంగా నిర్వహించారు. రెండు రోజులు జరిగే స్పోర్ట్స్ మీట్‌ను గుడిపేట బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొంటున్నారు. ఫాదర్ జోష్, గుడిపేట పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, పాఠశాల హెచ్‌ఎంలు సిస్టర్ ఆల్ఫీ, సీఎంసీ సిస్టర్స్ పాల్గొన్నారు.

ఆశలకు కనీస వేతనం పెంచాలి

బెల్లంపల్లి: తమకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం పెంచాలని కోరుతూ తెలంగాణ ఆశవర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఆశవర్కర్లు ఆందోళన చేపట్టారు. బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

హెడ్ కానిస్టేబుల్‌కు అభినందన



సమ్మయ్యను అభినందిస్తున్న సీపీ శ్రీనివాస్

బెల్లంపల్లి: హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన 11వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో బహుమతులు సాధించిన బెల్లంపల్లి పోలీసు హెడ్ కానిస్టేబుల్ పూదరి సమ్మయ్యను రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అభినందించారు. సమ్మయ్య అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. శుక్రవారం పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఆయన్ను సీపీ అభినందించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏఆర్ ఏసీపీ సుందరరావు, ఆర్ఐలు దామోదర్, సంపత్ ఉన్నారు.

అనుమతి లేని టింబర్ డిపోలపై చర్యలు

వేమనపల్లి: అనుమతి లేకుండా కలప కోత మిషన్లు ఏర్పాటు చేసి టింబర్ డిపోలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్వో అప్పలకొండ హెచ్చరించారు. నీల్వాయి అటవీ రేంజ్ కార్యాలయంలో కొత్తగూడం, కల్మలపేట, మామడ గ్రామాలకు చెందిన వడ్రంగులతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. డీఆర్ఓ ప్రమోద్‌కుమార్, ఎఫ్‌బీఓ మహిపాల్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే చీడపీడల నివారణ

జైపూర్: వేరుశనగలో సస్యరక్షణ చర్యలతోనే చీడపీడలను నివారించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి కోఆర్డినేటర్ కోట శివకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని పౌనూర్, గోపాలపూర్, గోదావరిపల్లి గ్రామాల్లో శుక్రవారం కృషివిజ్ఞాన కేంద్రం, జైపూర్ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వేరుశనగ పంటలపై క్షేత్ర సందర్శన నిర్వహించారు. శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, ఏవో మార్క్‌గ్లాస్టన్, మాజీ సర్పంచ్ సారయ్య, ఉపసర్పంచ్ స్వామి ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ముగ్గుల పోటీలు

మందమర్రిరూరల్: సంక్రాంతి పురస్కరించుకుని మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ ఆవరణలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ముగ్గులు వేయగా ఉపాధ్యాయురాలు పరిశీలించి ఉత్తమ ముగ్గులను ఎంపిక చేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా జీఎం దేవేందర్ బహుమతులు అందిస్తారని హెచ్‌ఎం పురుషోత్తం తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

శ్రీరాంపూర్: హెచ్ఎంపీవీ వైరస్ పట్ల కంపెనీ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సింగరేణి ఏరియా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి తెలిపారు. ఆర్కే 7 గనిలో ఈ వైరస్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం, మాస్క్ ధరించడం చేయాలన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2ఇంక్లైన్ గనిపై గని మేనేజర్ లక్ష్మీనారాయణ శుక్రవారం గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏఐటీయూసీ గని ఫిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, సంక్షేమాధికారి భార్గవ్ తదితరులు ఉన్నారు.

మండల అధ్యక్షుడిగా చందు

దండేపల్లి: మండల ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చింతపల్లికి చెందిన చుంచు చందు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్ ఎన్నికయ్యాడు.

లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

చెన్నూర్: యువకులు లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎంవీఐ రనంజీ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక కొత్త బస్టాండ్, చౌరస్తాల్లో వాహన యజమానులు, డ్రైవర్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు ఉంటాయన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన

మందమర్రిరూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా ద్వారా రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి గెలిచాక రూ.12 వేలు ఇస్తామని ప్రకటించి రైతులను మోసం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఆదిల్‌పేట్‌లో నాయకులు శుక్రవారం నిరసన చేపట్టారు. నాయకులు ఇంటింటికీ తిరుగుతూ వాల్‌పోస్టర్లు అంటించారు. మాజీ సర్పంచులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కోటపల్లి: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సీఐ సుధాకర్ సూచించారు. పార్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్సై రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.